సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ కోర్సులను అభ్యసించడానికి స్కాలర్‌షిప్ (ఆర్థిక సహాయం) మంజూరు కోసం అర్హత కలిగిన మైనార్టీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. 1తేదీ ఆగస్టు 2023 నుంచి 31 డిసెంబర్ 2023 వరకు ప్రవేశం పొందిన, అన్ని అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన విద్యార్థులు WWW.TELANGANAEPASS.CGG.GOV.IN వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20 నుంచి మార్చి 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హార్డ్ కాపీలు, అవసరమైన పత్రాలు ఏప్రిల్ 15 లోపు అందజేయాలని, అన్ని స్కీమ్స్ తదితర వివరాలు వెబ్‌సైట్‌లో చూపబడ్డాయని తెలిపారు. వివరాలకు DMWO మేడ్చల్ జిల్లా కార్యాలయంలో కాని 9985145442, 9492 037940 నంబర్లల్లో సంప్రదించాలని సూచించారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, ఫిబ్రవరి 19 : కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి గల యువతి, యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీజీ, ఇంజినీర్, పాలిటెక్నిక్, డిప్లొమా యువకులు ఈ నెల 29 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7893141797, ఆన్‌లైన్‌లో www.nacsindia.orgలో సంప్రదించాలని సూచించారు.

జవహర్‌నగర్‌లో నెగ్గిన అవిశ్వాసం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 19: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్ కావ్యపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. భారీ బందోబస్తు మధ్య కార్పొరేటర్లు బస్సులో వచ్చి నేరుగా కార్పొరేషన్ కార్యాలయంలోకి వెళ్లి అవిశ్వాసంలో పాల్గొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో అవిశ్వాస కార్యక్రమం నిర్వహించారు. 20 మంది కార్పొరేటర్లు మేయర్ కావ్యకు వ్యతిరేకంగా చేతులెత్తి బలనిరూపణ చేశారు. మేయర్ కావ్యకు అనుకూలంగా ఉన్న 7మంది కార్పొరేటర్లు అవిశ్వాసంలో పాల్గొనకుండా బయటకు వచ్చారు. దీనికి ఆమోదం తెలిపిన అధికారి ఎన్నిక ప్రక్రియనంతటిని కలెక్టర్‌కు విన్నవిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, కాప్రా తాసీల్దార్ సుచరిత, ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఎస్సైలు అనిల్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ రెడ్డి, లక్ష్మణ్, మున్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నేడు

- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ప్రెస్‌మీట్.
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు 'మోరల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఫర్ పొలిటికల్ పార్టీస్ అండ్ క్యాండిడేట్స్' అంశంపై ప్రెస్ కాన్ఫరెన్స్.
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు క్రైస్తవులపై దాడులకు వ్యతిరేకంగా గ్లోబల్ అలియెన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్ ప్రెస్ కాన్ఫరెన్స్.

రక్తంతో వ్యాపారం

ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల నిలువు దోపిడీ

డ్రగ్ కంట్రోల్ అధికారుల నిర్లక్ష్యంతో పెరుగుతున్న ఆగడాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ధనార్జనే ధ్యేయంగా మానవత్వాన్ని మరిచి మనుషుల రక్తాన్ని కూడా వదలడం లేదు కొన్ని మాఫియాలు. ఈ క్రమంలోనే కొన్ని ముఠాలు సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని, అవినీతిని ఆసరాగా చేసుకుని మనుషుల రక్తంతో వ్యాపారం చేస్తూ, లక్షలు సంపాదిస్తున్నారు. తక్కువ డబ్బులకు రక్తాన్ని సేకరించి, వాటి నుంచి ప్లాస్మా, ఎర్ర రక్త కణాలు వంటి కాంపోనెంట్స్‌ను వేరు చేసి వేల రూపాయలకు విక్రయిస్తున్నారు. దవాఖానల్లో కొనఊపిరితో ఉన్న రోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని రెట్టింపు ధరలకు బ్లడ్ కాంపోనెంట్స్‌ను విక్రయిస్తున్నారు. అయితే ప్లాస్మా, ఎర్ర రక్త కణాలు వంటి కాంపోనెంట్స్‌ను కూడా సరైన పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా తయారు చేసి రోగుల ప్రాణాలతో చలగాటమాడుతున్నాయి.

మొన్నటివరకు నిద్రపోయిన అధికారులు..

గతంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ డీజీగా అకున్‌సభర్వాల్ పనిచేసిప్పుడు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే బ్లడ్ బ్యాంకులు, అనుమతులు లేని ఫార్మా కంపెనీలు, నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై డీసీఏ అధికారులు దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఆయన బదిలీ అయిన తరువాత దాదాపు మూడు, నాలుగేండ్లలో ఈ అక్రమాలను ప్రశ్నించిన దాఖలాలు లేవు. ఆ మధ్య కాలంలో డీసీపీకి చెందిన అధికారులే కీలక బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. అయితే సదరు అధికారులకు తెలిసే ఇప్పుడు పట్టుబడుతున్న అక్రమాలు జరిగాయా? లేక ఆ అధికారులు నిర్లక్ష్యంతో విధులు నిర్వర్తించకపోవడం వల్ల ఈ అక్రమాలు కొనసాగుతూ వచ్చాయా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఔషధాల తయారీ, విక్రయాలు, బ్లడ్ కాంపోనెంట్స్ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు ఇంత కాలం మౌనంగా ఉంటూ ఇప్పుడు కొత్తబాస్ కొరడా ఝుళిపించడంతో బలవంతంగా చర్యలకు పూనుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముందుగా డీసీఏలో పనిచేస్తున్న అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రేటర్‌లో జరుగుతున్న అక్రమాలపై ఇంతకాలం దృష్టిపెట్టని అధికారులను జవాబుదారులుగా చేసి, చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

- 117 మందికి జరిమానా, జైలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 19 : సుమాయిష్‌లో మహిళల భద్రతకు హైదరాబాద్ షీ టీమ్స్ విభాగం ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకున్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 49 రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనను 24 లక్షల మంది సందర్శించగా అందులో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఆదివారంతో ముగిసిన ఈ ప్రదర్శనలో షీ టీమ్స్ వివిధ కేసుల్లో 117 మందిని అదుపులోకి తీసుకుని పరివర్తన దిశగా చర్యలు తీసుకున్నారు. ఇందులో 41 మందికి 2 రోజుల జైలు శిక్ష.. రూ.250/- జరిమానా, 10 మందికి 3 రోజుల జైలు శిక్ష.. రూ.250 జరిమానా, నలుగురికి 4 రోజుల జైలు శిక్ష.. రూ.250 జరిమానా, ఒక నేరస్తుడికి రూ.250 జరిమానా విధించినట్లు ఉమెన్ సేఫ్టీ డీసీపీ కవిత తెలిపారు.

బాస్కెట్‌బాల్ చాంప్ ఇన్‌కమ్ ట్యాక్స్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉట్నూర్(గద్వాల) వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ విజేతగా నిలిచింది. సోమవరం జరిగిన మ్యాచ్‌లో ఇన్‌కమ్‌ట్యాక్స్ టీమ్ 92-72తో డ్రీమ్ బాస్కెట్‌బాల్ అకాడమీపై అద్భుత విజయం సాధించింది. టైటిల్ దక్కించుకున్న ఇన్‌కమ్ ట్యాక్స్ తరపున గణేశ్‌పాటిల్(29), విసు(21) రాణించారు. మరోవైపు డ్రీమ్ బాస్కెట్‌బాల్ అకాడమీ జట్టులో పృథ్వీ(25), దినేశ్(23) ఆకట్టుకున్నారు.

సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, లాస్యనందిత

జనం మెచ్చిన నాయకుడు సాయన్న

కంటోన్మెంట్, ఫిబ్రవరి 19 : దివంగత కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కార్ఖానాలోని గృహలక్ష్మి కాలనీలో నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందితతో పాటు కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనం మెచ్చిన నాయకుడిని.. స్మరించుకునేందుకు అభిమానులు తరలివచ్చారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్ఎస్ నేత భద్రారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, పాండు యాదవ్, లోకనాథంతో పాటు నేతలు టీఎన్ శ్రీనివాస్, మురళీయాదవ్, పనస సంతోష్ హాజమరై సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే రెండో వార్డులోని సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం వద్ద బీఆర్ఎస్ నేతలు నరేశ్, బాలరాజ్, అంజనేయులు ఆధ్వర్యంలో చీరల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పలు వార్డుల బీఆర్ఎస్ ప్రెసిడెంట్లు, పలువురు సీనియర్, యువ, మహిళా నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో మహాత్మా గాంధీ విగ్రహం పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని సోమవారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు గాంధీ విగ్రహం పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు.

- బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 19

బాలాపూర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి దేవాలయంలో పరమహంస హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి సోమవారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి, సినీనటి అనసూయ, ఆకాశ్ పూరి, మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

- బడంగ్‌పేట, ఫిబ్రవరి 19

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మేకల కావ్య

కేసులను కప్పిపుచ్చుకునేందుకే అవిశ్వాసం

జవహర్‌నగర్ మేయర్ కావ్య

జవహర్‌నగర్, ఫిబ్రవరి 19: మేక తోలు కప్పుకుని పులి గాంభీర్యం చూపిస్తే పొరపాటేనని, జవహర్‌నగర్ కార్పొరేటర్ల వ్యవహారశైలి కూడా అలానే ఉందని మేయర్ కావ్య అన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి... డబ్బుల కోసం కక్కుర్తిపడి అవిశ్వాసానికి తెరలేపారని విమర్శించారు. ఎలాంటి అవినీతికి పాల్పడని తనపై అవిశ్వాసం పెట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన మీడియా సమావేశంలో మేయర్ కావ్య మాట్లాడుతూ పదవులు కాపాడుకోవడం, ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం, కేసులను కప్పిపుచ్చుకునేందుకే డిప్యూటీ మేయర్ అవిశ్వాసానికి తెర లేపారని విమర్శించారు. ల్యాండ్ గ్రాబర్‌కు మేయర్ పీఠం ఇస్తే జవహర్‌నగర్ సర్వనాశనం అవుతుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఏకే మురుగేశ్, శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, ఆశాకుమారి, సంగీతారాజశేఖర్, శ్రీకాంత్, సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి వాకర్స్ లేఖ

పబ్లిక్ గార్డెన్ సుందరీకరణ గురించి నాంపల్లికి చెందిన సీనియర్ సిటిజన్‌లు, వాకర్స్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా, మహ్మద్ అబిద్ అలీతో పాటు పర్యావరణ, సామాజిక కార్యకర్తకు లేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వర్ పాష, అబ్దుల్ రహీం, జాకబ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

- అబిడ్స్, ఫిబ్రవరి 19

సీడీఎఫ్‌డీ డైరెక్టర్‌గా ప్రొ.ఉల్లాస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఉల్లాస్ కొల్తూర్ సీతారాం బాధ్యతలు స్వీకరించారు. గతంలో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. తాజాగా ఆయనను సీడీఎఫ్‌డీ డైరెక్టర్‌గా నియమిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయాటెక్నాలజీ ఆదేశాలు జారీ చేసింది. తాజాగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.ఉల్లాస్‌ను సీడీఎఫ్‌డీ సైంటిస్టులు కలిసి అభినందనలు తెలిపారు.

మన బడి కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అమెరికా దేశం జార్జియా రాష్ట్రంలో..

మియాపూర్, ఫిబ్రవరి 19: అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో సిలికానాంధ్ర, ఆల్పారెట్టా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో దేశానా మిడిల్ స్కూల్‌లో 'మనబడి' పిల్లల పండుగను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కాగా ఆల్పారెట్టా ప్రాంతంలో నివసించే వెయ్యికి పైగా తెలుగు వారు మనబడి వేడుకల కార్యక్రమానికి హాజరయ్యారు. ఆల్పారెట్టా సమన్వయ కర్త నరేశ్ దొడ్డాక, అట్లాంటా ప్రాంతీయ సమన్వయ కర్త విజయ్ రావిళ్ల నేతృత్వంలో మనబడి పిల్లల పండుగ సందడిగా సాగింది. ఈ సందర్భంగా మామిళ్ల వెంకటరంగయ్యగారి లోకనాథం మాట్లాడుతూ..మనబడి ద్వారా తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. సిలికానాంధ్ర ఆల్పారెట్టా, అట్లాంటా ప్రతినిధులు మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్నా మాతృభాషను ఎన్నటికీ మరువబోమని, మనబడి ద్వారా చిన్నారులకు ప్రత్యేక తెలుగు తరగతులను నిర్వహిస్తూ వారిలో భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యాదవులకు ఎంపీ సీట్లు కేటాయించాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న యాదవులకు అన్ని పార్టీలు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని యాద వ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు యాదవులకు చట్ట సభల్లో సరైన ప్రాధాన్యత లభించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో గొర్రెల పథకం, కార్పొరేషన్ తదితర పథకాలు ప్రవేశపెట్టారని, మంత్రి పదవులు సైతం కేటాయించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఖమ్మం ఎంపీ స్థానాన్ని తమ అభ్యర్థి నాగసీతారాములుకు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంశీ మోహన్ యాదవ్, అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జి.రవి యాదవ్, ఐటీ కన్వీనర్ జి.పవన్ యాదవ్, శ్రీనివాస్ యాద వ్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి సర్కిల్ మిర్జాలగూడ వెంకటేశ్వర అపార్టుమెంట్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

చెత్తను తొలగించండి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 19: చెత్తను తొలగించి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. మల్కాజిగిరి సర్కిల్ మిర్జాలగూడ వెంకటేశ్వర అపార్టుమెట్ రోడ్డులో స్థానికులు చెత్తను వేస్తుండటంతో డంప్ యార్డును తలపిస్తుంది. సర్కిల్ పారిశుధ్య విభాగం సిబ్బంది చెత్తను తొలగించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుండి సమీపంలో ఉన్న బెతేల్ ప్రేయర్ హౌస్, మసీదుకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. చెత్త సమస్యపై సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజుకు గతంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. పేరుకుపోయిన చెత్తను తొలగించి, స్థానికులు రోడ్డుపై చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిమ్స్‌కు మరో రెండు బ్యాటరీ వాహనాలు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 19 : నిమ్స్‌కు మరో రెండు బ్యాటరీ వాహనాలు సమకూరాయి. కరూర్ వైశ్యా బ్యాంకు సౌజన్యంతో రోగుల సౌకర్యార్థం రూ.23లక్షలతో 14 సీట్ల కెపాసిటీ కలిగిన రెండు బ్యాటరీ వాహనాలను బ్యాంకు బిడ్స్ బ్రాంచ్ డివిజనల్ ఆపరేటింగ్ అధికారి ఎం.వెంకటేశ్వర్ రావు దానికి సంబంధించిన పత్రాలు, తాళాలను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు అందజేశారు. రెండు బ్యాటరీ వాహనాలను అందజేసిన బ్యాంకు యాజమాన్యానికి డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యానారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, బ్యాంకు, నిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాటరీ వాహనం పత్రాలను నిమ్స్ డైరెక్టర్‌కు అందజేస్తున్న వెంకటేశ్వర్ రావు

ధైర్యశాలి ఛత్రపతి శివాజీ

మలక్‌పేట, ఫిబ్రవరి 19: మొగలుల దాడులను సమర్థవంతంగా ఎదుర్కొని దేశంలోకి అడుగుపెట్టనీయకుండా అడ్డుకున్న గొప్ప ధైర్యశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని మూసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకొని డివిజన్‌లోని స్వామి వివేకానంద పాఠశాల చౌరస్తా వద్ద యువజన నాయకుడు రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కోశాధికారి తుమ్మలపల్లి రమేశ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 19 : హైకోర్టు ఉత్తర్వులను పరిగణలోకి తీసుకొని గురుకులాల ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలని గురుకులాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణా రెడ్డి, వడ్డేపల్లి ప్రభుదాస్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సెక్రటేరియట్‌లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి, మహాత్మా జ్యోతిరావు పూలే, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ కార్యదర్శి మల్లయ్య భట్టులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి, ప్రభుదాస్ మాట్లాడుతూ... జీవో 317ను చాలెంజ్ చేస్తూ వేసిన కేసుపై హైకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా 130 మంది ఉపాధ్యాయులకు స్టేటస్ కోను కొనసాగిస్తూ, మిగిలిన ఉపాధ్యాయులకు జీవో 317ను అనుసరించి బదిలీలు నిర్వహించుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు సీఎం చొరవ తీసుకోవాలని కోరారు.

కార్యదర్శి సీతాలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న గురుకులాల ఉపాధ్యాయులు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మేడారం మహాజాతర సందర్భంగా రెండు లక్షల మాస్కులు, 50 వేల ప్రిస్క్రిప్షన్ ప్యాడ్‌లను మంత్రి సీతక్కకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, కార్యదర్శి డాక్టర్ విజయ్‌రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్‌యాదవ్ సోమవారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా సూపరింటెండెంట్ శబరీష్, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మహ్మద్ అన్వర్, డాక్టర్ బింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 19